# హతవిధీ మళ్ళీ మరోరోజు [illegible]!



కె. రమేష్ కుమార్

"అబ్బబ్బ! వెధవ గొడవ! వెధవ గొడవ! ప్రాణాలు పోతున్నాయి ఈ వెధవ గొడవతో!" ఈ మాటలు అన్నదెవరో కాదు!! నేనే! అన్నట్లు నా పేరేంటో తెలుసా? గోపాలంగారు.

(అంతా రమణారెడ్డంటూ ఏడిపిస్తార్లెండి)

ఇంతకీ అసలు సంగతేవిటంటే మా ఎదురింట్లో ఒక రేడియో, ప్రక్కింట్లో ఒక ట్రాన్సిస్టరు, వెనుక పోర్షన్లో ఓ ట్రాన్సుమెయిన్సు (దీన్ని 'రేడియో ట్రాన్సిస్టర్' అనికూడా అంటారట!) కసి పుల్ సౌండులో వివిధ రకాల సంగీత ధ్వనులు చేస్తున్నాయి. మరో ప్రక్క వెంకటేశ్వర స్వామి గుళ్ళో ఎమ్మెస్ సుబ్బలక్ష్మి లాంటావిడ "వెంకటరమణా, వెంకటరమణా!" అంటూ (దమ్ మారో దమ్....) హరేకృష్ణా, హరేరామ్! స్టైల్లో భజన చేస్తోంది. ఈ రకరకాల సంగీత ధ్వనులన్నీ కలిసి ఓ సంకర జాతి రకం సంగీతం ఏర్పడింది. ఆ సంకర జాతి సంగీతం మన గార్దభేశ్వరరావుగారి సంగీతాన్ని పోలి వుంది. ఏం చేస్తాం చచ్చినట్లు వినాల్సిందే! ఖర్మ!

ఏం చేయాలి? ఏం చేయాలిప్పుడు?

ఆ! ఐడియా! వెంటనే లేచి వెనుక

పోర్షన్లో వాళ్ళని 'కాస్త రేడియో సౌండ్ తగ్గిస్తారా' అని ఎంతో వినమ్రతతో అడిగాను. కాని ఏం లాభం? వారి గీర్వాణ వంశానికి చెందిన వాళ్లు నేను చెప్పేమాట పూర్తి కాకుండానే గుడ్లెర్రజేసి 'ఏం? సౌండ్ తగ్గించాలా? మేమూ అద్దె ఇస్తున్నాము! తెల్సిందా?'' అన్నది రెండు పిప్పళ్ళ బస్తాల పరిమాణంలో వున్న పిన్నిగారు' రోడ్ రోలర్లా దొర్లుకుపోతూ,

నా ఐడియా ఫెయిలవడంతో నాకు వళ్లు మండిపోయింది. కాని ఏం చేస్తాను? ప్రక్కనే కిర్రు కిర్రుమంటూ మరో క్రొత్త రకం సంగీతాన్ని సృష్టిస్తున్న తలుపులపై నా ప్రతాపాన్ని కాల్తో చూపించాను

అంతే! అవి క్రీస్తు పూర్వం నాటి తలుపులేమో! ఒక్కసారిగా ఊడిపడ్డాయి కాళికావతారం దాలుస్తూ యిల్లుగల ఆవిడ ఉరుములు మెరుపుల్తో వచ్చింది. ఇళ్ళ గోడలూ, తలుపులూ యిల్లుగలావిడకి అవయవాల్లాంటివి. ఒక అవయవానికి దెబ్బ తగిలితే వెంటనే బాధనిపించదూ? అదే యిప్పుడు జరిగింది

"ఏవోయ్ గోపాలం! నా తలుపులన్నీ ఎలాగున్నాయో అలాగే బిగించు, లేకపోతే... ఊఁ ...కానీ' అన్నది యిల్లుగలవిడ కళ్ళనుండి నిప్పులు కురిపిస్తూ, ఘర్జిస్తూ.

గోపాళం ఏంటి తెపాళంలా?' ఒక కన్నీర్లో నాగభూషణం పక్కిలో అందామనుకున్నాను కాని అంటే ఎక్కడ కరుస్తుందో అన్న భయంతో యింట్లోకి వెళ్ళి స్క్రూడ్రైవరు తెచ్చి ఎవరు చేసినఖర్మ వారనుభవించక తప్పదన్నా' అని పాడుకుంటూ తలుపుల మరలు బిగించసాగాను బిగిస్తుంటే మర మేకులు పుటుక్కున విరిగిపోసాగాయి. బి. సి. కాలం నాటివి కదా మరి!

ఇల్లుగలావిడవైపు చూశాను "క్రొత్త మేకులు తెచ్చి బిగించుకో!" అన్నట్లు వురుముతూ చూసింది

"వెధవగోల! వెధవ ఇల్లుకొంప" అని తిట్టుకుంటూ, ఏడ్చుకుంటూ సైకిలు తీసుకొని మరమేకులకొరకు బయల్దేరాను.

తీరా బజార్లోకొచ్చేసరికి తెలిసింది ఆరోజు ఆదివారమని! ఏం చేయాలి? మేకులు తీసుకెళ్ళకపోతే ఇల్లుగలావిడ చంపేయ్యదూ? పోనీ ఈరాత్రి ఏ ఫ్రెండు కొంపలోనన్నా గడుపుదామంటే ఈ వెధవ ఊళ్ళో నాకెవరూ ఫ్రెండ్సులేరే! మేకులు కొనాల్సిందే!

సైకిలు తొక్కుతూ ఊరంతా గాలించడం మొదలుపెట్టాను తొక్కుతుంటే 'క్రీక్ చుక్ క్రీక్ చుక్'' అంటూ సంగీతం ఆలాపించసాగింది. మా నాన్న చిన్నప్పటి సైకిలు ఇప్పటి ప్రస్తుతం నా సైకిలు!

"క్రొత్తసైకిలు కొనునాన్నా' అంటే, "నీకొచ్చే మామగారే కొనిస్తార్రా!'' అంటాడు మా నాన్న రైలింజన్లా పొగ వదుల్తూ. వెధవ సైకిలులాంటి చిన్న చిన్న వస్తువుల్ని మామగార్ని అడిగితే ఏం బావుంటుంది మీరైనా చెప్పండి?

హమ్మయ్య! కష్టాలు గట్టెక్కాయి. ఇక్కడ ఓ ఇనపకొట్టు తెరిచుంది గదా! తీరా మేకులు చూస్తే పాలిష్ అంతా కొట్టుకుపోయున్నాయి ఏంచేస్తాను? అవే కొన్నాను అవసరం అలాంటిది మరి

గాలితో పందెంవేసి ఆఘమేఘా మీద ఇంటికొచ్చిపడ్డాను. వెంటనే గబగబా తలుపులు బిగించేశాను కాని, ఇల్లుగలావిడ ముఖంలో సంతృప్తి కనిపించలేదు. కొత్త తలుపులేయిస్తే సంతృప్తి చెందునేమో రాక్షసిముండ! అనుకుంటూ కోపంతో చేతిలోని స్క్రూడ్రైవర్ని నేలకేసి కొట్టాను బలమంతా ఉపయోగించి.

అంతే! తరువాత ఏం జరిగిందో తెలిసేసరికి గజగజా వణికిపోతూ ఇల్లుగలావిడ కాళ్ళమీద పడ్డాను ఒక్క తాపు తన్ని శాపనార్థాలు లంకించుకుంటూ, పెద్ద పెద్ద అంగలేస్తూ వెళ్ళిపోయింది ఇల్లుగలావిడ. (రక్షించింది! ఇంకానయం చంపేస్తుందేమోననుకున్నాను)

ఇంతకీ ఏం జరిగిందంటే నేను విసిరిన స్క్రూడ్రైవరు నేలని తాకి దాని పిడి పగిలి (ప్లాస్టిక్కుది కదా!) ఒక ముక్క మా ఇల్లుగలావిడ మొహంవైపు అమెరికా వాళ్ళుపయోగించిన రాకెట్లా దూసుకుపోయింది అదండీ జరిగిన సంగతి! దీన్లోకూడా నా తప్పుందంటారా?

నా నెత్తిమీద శని కూచుందిలాగుంది. అసలు ఈ కొంపే శని, వెంటనే గబగబ సామానంతా పెట్టెల్లో సర్దేశాను, ఇల్లు ఖాళీ చేద్దామని. తీరా పెట్టెలెత్తుకుని ఇంట్లోంచి పోదామని బయల్దేరే సరికి అప్పుడు గుర్తుకొచ్చింది ఈ మహా పట్టణంలో కొంపల్దొరకవని, అయ్యో!

పెట్టెలన్నీ ఓ మూల పారేసి మంచంపై పడి బావురుమని ఏడ్చాను ఈ అద్దె కొంప నా కాబోయే అత్తగార్లాంటిదను కుంటూ! నా ఏడుపుకి తగ్గట్టు ముందు, ప్రక్క, వెనుక నున్న రేడియో, ట్రాన్సిస్టర్, ట్రాన్సుమెయినులు విషాద గీతం ఆలాపించసాగాయి నా ఏడుపు ఇంకా ఎక్కువయింది.

అర్ధరాత్రి సరిగా పదకొండుగంటల యాభై తొమ్మిది నిముషాల యాభై తొమ్మిది సెకన్లకి రేడియో, ట్రాన్సిస్టర్ ట్రాన్స్మెయినులు తమ సంగీతాన్ని ఆపాయి. నా దుఃఖం. ఏడుపు కూడా ఆగాయి, తలుపులన్నిటి గడలు వేసి (వేసినా వెయ్యకపోయినా ఒకటేలెండి!) హాయిగా నిద్రపోదామని పడకపైవాలాను.

ఇంతలో కుంభకర్ణుడిలా లేక పోరాటానికి తయారయిన వరాహంలా ఘుర్జిస్తూ మా పక్కింటాయన గురక మొదలయింది, తగ్గిపోయిన నా దుఃఖం తిరిగి మొదలయింది ఒంటి గంట .... రెండు గంటలగ్గాబోలు కలత నిద్రం టారేదో లాంటిదేదో పట్టింది నాకు.

తాడాలో నాలుగ్గంటలు కొట్టారు (ఈ కాలంలో తాడాలేవండీ! ఇదేదో కలలో లాగుంది)

అంతే! తిరిగి మా ముందు, ప్రక్క వెనకింట్లోంచి రేడియో, ట్రాన్సిస్టర్, ట్రాన్సుమెయిన్ల సంగీతం సుప్రభాతంలా మొదలయింది

వెంకటేశ్వర స్వామి గుళ్ళో కూడా అరిగిపోయిన రికార్డు ఇలా మొదలెట్టింది 'కౌసల్యా సుప్ర సు .. సుప్ర.... సుప్ర(టుర్) జా రామా పూ.... మాపూ ....మాపూ ....''